కోటి తలంబ్రాల దీక్షలో ఎమ్మెల్సీ

గోటితో వడ్లను వలుచుతున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

గజ్వేల్, మార్చి 19: కోటి తలంబ్రాల దీక్షలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పాల్గొని గోటిలో వడ్లను వలిచి తలంబ్రాలుగా మార్చారు. మంగళవారం ఆయన కార్యాలయంలో రామ కోటి రామరాజు వడ్లను అందజేయగా వాటిని తలంబ్రాలుగా తయారు చేయడంలో పాల్గొన్నారు. గజ్వేల్ రామకోటి భక్తసమాజానికి ఇలాం టి అవకాశం రావడం మనందరి అదృష్టంగా భావించాలన్నారు.

ప్రతిభా పురస్కారానికి శ్రీనివాస్ ఎంపిక

అన్నవరం శ్రీనివాస్

హుస్నాబాద్‌టౌన్, మార్చి 19: హుస్నాబాద్ ప్రాంతానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు అన్నవరం శ్రీనివాస్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. కరీంనగర్ మండలం వేగురపల్లిలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న శ్రీనివాస్ గీసిన పలు చిత్రాలు అనేక వర్క్‌షాపుల్లో ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నాడు. కవులు, రచయితలకు చెందిన దాదాపు 500 పుస్తకాలకు సైతం కవర్ చిత్రాలను శ్రీనివాస్ గీశారు. తెలంగాణ ఉద్యమంలో గీసిన కార్టూన్లు పలు దినపత్రికల్లో రావడమే కాకుండా అనేక అవార్డులను సైతం సొంతం చేసుకున్నాడు. ఈనెల 28వ తేదీన హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్‌లో అన్నవరం శ్రీనివాస్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారాన్ని అందుకోనున్నారు. శ్రీనివాస్ ప్రతిభా పురస్కారానికి ఎంపిక కావడంపై పలువురు కవులు, రచయితలు, చిత్రకారులు హర్షం వ్యక్తం చేశారు.

మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో యువత పోరాడాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

చేర్యాలలో మల్లు స్వరాజ్యం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి

చేర్యాల, మార్చి 19 : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో యువత పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పిలుపునిచ్చారు.పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో మల్లు స్వరాజ్యం ద్వితీయ వర్ధంతి నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ముస్త్యాల ప్రభాకర్, శెట్టిపల్లి సత్తిరెడ్డి, కొంగరి వెంకట్‌మావో, రాళ్లబండి నాగరాజు, బద్దిపడిగే కృష్ణారెడ్డి, బండకింది అరుణ్, ఇప్పకాయల శోభ, నూర్బి, లావణ్య, అస్గర్, రంజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా ఐధ్వర్యంలో..

మహిళా లోకానికి దిక్సూచిగా కామ్రేడ్ మల్లు స్వరాజ్యం నిలిచారని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) పట్టణ కార్యదర్శి ఇప్పకాయల శోభ అన్నారు.ఐద్వా అధ్వర్యంలో మల్లు స్వరాజ్యం వర్ధంతి నిర్వహించారు.కార్యక్రమంలో లావణ్య, లక్ష్మి, భవాని, బాలమణి, నర్సవ్వ, కనకవ్వ, మాధవి, రేణుక పాల్గొన్నారు.

కొమురవెల్లిలో..

కొమురవెల్లి, మార్చి 19 : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం రెండో వర్ధంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి అత్తిని శారద, రవీందర్, ఇస్తారి, మల్లేశం, భరత్, నరేశ్, మల్లవ్వ, నర్సమ్మ పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

హుస్నాబాద్ అయ్యప్పస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న పడిపూజలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న దంపతులు

హుస్నాబాద్ టౌన్, మార్చి 19: హుస్నాబాద్ పట్టణంలోని అయ్యప్పస్వామి 22వ ఆలయ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో గణపతి పూజ, పంచామృతంతో అభిషేకం, హోమం నిర్వహించారు. అనంతరం పూజారి భానుమూర్తి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా పడిపూజ నిర్వహించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్‌చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న దంపతులు, మాజీ మున్సిపల్ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, మైదంశెట్టి వీరన్న, అయిలేని శంకర్‌రెడ్డి, కొత్తపల్లి అశోక్, సురేందర్, శ్రీకాంత్, నవీన్, మల్లేశ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మిరుదొడ్డి, మార్చి 19 : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో, మిరుదొడ్డి టౌన్ ప్రత్యేకాధికారి గణేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మిరుదొడ్డి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇండ్లలోని చెత్తా చెదారాన్ని బుట్టల్లో ఉంచి చెత్తబండి సిబ్బందికి అందజేయాలన్నారు. ఎ లాంటి సమస్యలు ఉన్నా నేరుగా సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఎంపీవో జహీరొద్దీన్, కార్యదర్శి ఫహీమ్ పాల్గొన్నారు.

మల్లన్న ఆదాయం రూ.45,62,032

చేర్యాల, మార్చి 19 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల తొమ్మిదో ఆదివారం రూ.45,62,032 ఆదాయం వచినట్లు ఆలయ ఈవో బాలాజీ, ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి తెలిపారు. శని, ఆది, సోమవారాల్లో ఆర్జిత సేవలు, గదులు, దర్శనాల, ప్రసాదాల విక్రయం తదితర వాటి ద్వారా ఈ ఆదాయం వచ్చిందన్నారు. శనివారం రూ.4,18,673, ఆదివారం రూ.37,47,172, సోమవారం రూ. 3,96187 వచ్చినట్లు పేర్కొన్నారు. ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్ నీల శేఖర్, ఆలయ ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, ఒగ్గుపూజారులు, సిబ్బంది ఉన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

అక్కన్నపేట, మార్చి 19: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హుస్నాబాద్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కృష్ణతేజ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సరానికి నాలుగున్నర లక్షల లోపు ఆదాయం కలిగిన వారికి కోర్టు కేసుల పరిష్కారం విషయంలో న్యాయ సహాయాన్ని అందించేందుకు ప్రతి మండలంలో న్యాయసేవాధికార సంస్థ కృషిచేస్తుందన్నారు. తల్లిదండ్రులు చిన్నప్పటి నుంచే పిల్లలను క్రమశిక్షణతో పెంచితే సమాజంలో నేరాలను అరికట్టవచ్చన్నారు. లోక్ అదాలత్ ద్వారా సివిల్ కేసులను కక్షిదారులు రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. న్యాయవాదులు రామకృష్ణ, జూంలాల్‌నాయక్, రవీందర్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంతారావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

హుస్నాబాద్, మార్చి 19: మండలంలోని పోతారం(ఎస్), జిల్లెలగడ్డ, భల్లూనాయక్ తండాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను డీఆర్డీవో జయదేవ్ ఆర్య మంగళవారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న పనుల వివరాలను స్థానిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలీల సంఖ్యను ఇంకా పెంచడంతో పాటు కొత్త పనులను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకి ఉపాధి కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ సతీశ్, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వహించాలి

సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేట అర్బన్, మార్చి 19 : ఎన్నికల విధులు నిష్పక్షపాతంగా నిర్వహించాలని.. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని సిద్దిపేట పోలీస్ కమిషనర్ బి.అనురాధ అన్నారు. మంగళవారం పోలీస్ కమిషనరేట్‌లో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల విధులు, విధానాలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్, పటిష్టబందోబస్తు, క్రిటికల్, నార్మల్ పోలింగ్ కేంద్రాలు తదితర వాటిపై పోలీస్ అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలన్నారు. ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ల పరిధిలో విస్తృతంగా తనిఖీలు చేపట్టి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. రాజకీయ నాయకులు నిర్వహించే సభలు, సమావేశాలు, ఇంటింటి ప్రచారంపై నిఘా ఉంచాలని సూచించారు. ఓటరును మభ్యపెట్టే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో ఎన్నికల సందర్భంగా ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించినా, డబ్బులు పంచినా, ఓటర్లను మభ్యపెట్టినా వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1950కు ఫోన్ చేసి వివరాలు చెప్పాలని సూచించారు. సోషల్ మీడియా వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వాటి పై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ ఎస్.మల్లారెడ్డి, ఏఆర్ అడిషనల్ డీసీపీలు రామచంద్రరావు, సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు మధు, పురుషోత్తంరెడ్డి, సతీశ్, సుమన్ కుమార్, రవీందర్, శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

నిర్మాణాత్మక ప్రాజెక్టులు రూపొందించాలి

గజ్వేల్, మార్చి 19: విద్యార్థులు నిర్మాణాత్మక ప్రాజెక్టులు రూపొందించాలని అప్పుడే వారిలోని నైపుణ్యం బయటపడుతుందని సిద్దిపేట డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ గోపాల సుదర్శనం అన్నారు. మంగళవారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రాజెక్టుల నివేదికపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు సరోజన, నరేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు సిద్ధంగా ఉంచాలి

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి19: రాబోయే హరితహారం కార్యక్రమానికి నర్సరీల్లో మొక్కలను సిద్ధంగా ఉంచాలని మద్దూరు ఎంపీడీవో రామ్మోహన్ అన్నారు. మంగళవారం కొండాపూర్, దుబ్బతండా, హనుమతండా, రెడ్యానాయక్‌తండా, కూటిగల్ గ్రామాల్లో ఉపాధి పనులతో పాటు ఆయా గ్రామాల్లోని హరిత నర్సరీల్లో పెరుగుతున్న మొక్కలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పని ప్రదేశాల్లో కూలీలకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్‌ను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీవో ఖాజా మోహినుద్దీన్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా ప్రభుత్వ దవాఖాన ప్రహరీపై రాసిన బీజేపీ ఎన్నికల నినాదాలు

హుస్నాబాద్‌టౌన్ : ప్రభుత్వ దవాఖాన పహరీపై తొలిగించిన రాజకీయపార్టీల రాతలు

తొలిగిన ఎన్నికల రాతలు

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

హుస్నాబాద్‌టౌన్, మార్చి 19: ఎన్నికల రాతలు తొలిగించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న తీరుపై అధికారులు స్పం దించారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటికీ ప్రభుత్వ కార్యాలయాలపై రాజకీయ పార్టీల ఎన్నికల రాతలు తొలిగించే విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ మంగళవారం నమస్తే తెలంగాణ దినపత్రికలో వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. స్థానిక ప్రభుత్వ దవాఖానతోపాటు పలు ప్రాంతాల్లో అనుమతులు లేకుండా గోడలపై రాసిన రాజకీయపార్టీల ఎన్నికల రాతలను మున్సిపల్ సిబ్బంది తుడిచివేశారు.

గౌరారం వద్ద ఇసుకలారీని అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్, పోలీస్ బృందం

అక్రమ ఇసుక తరలింపుపై కేసున మోదు

వర్గల్, మార్చి19 : అనుమతులు లేకుండా ఇసుక తరలించేవారిపై కేసులు నమోదుచేసి జైలుకు పంపుతామని జిల్లా టాస్క్‌ఫోర్స్, గౌరారం పోలీసులు సంయుక్తంగా వెల్లడించారు.మంగళవారం గౌరారం వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం, గౌరారం పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా జిల్లాలో ఇసు క, మట్టి అక్రమంగా తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. జూదం, గంజాయి, ఇతర మత్తుపదార్థాల అమ్మకాలపై నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సెల్ : 871266445, 8712667446, 8712667447 ఫోన్ చేయాలన్నారు.

ఎంపీవోపై దాడికి నిరసన వెల్లువ

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి19: నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల ఎంపీవో శ్రవణ్‌కుమార్‌పై ఎంపీపీ దాడి చేయడాన్ని నిరసిస్తూ మద్దూరు మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఎంపీడీవో రామ్మోహన్‌తో పాటు పంచాయతీ ఉద్యోగులు మంగళవారం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు చేయడం సరికాదన్నారు. ఇలాంటి దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. మద్దూరు ఎంపీవో ఖాజా మోహినుద్దీన్, ఈసీ పరశురాములు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వందశాతం ఇంటిపన్నులు వసూలు చేయాలి

పాండువుల చెరువును సందర్శించిన గజ్వేల్ కమిషనర్ నరసయ్య

గజ్వేల్, మార్చి 19: గజ్వేల్‌ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలోని 20వార్డుల్లో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్నులను వందశాతం వసూలు చేయాలని కమిషనర్ నరసయ్య బిల్ కలెక్టర్లకు సూచించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో బిల్లు కలెక్టర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం పదిరోజుల్లో వంద శాతం పన్నులు వసూలు చేసేలా చూడాలన్నారు. ఇంటి , వ్యాపార సముదాయల పన్నులు పెండింగ్‌లో ఉండకుండా చూడాలన్నారు. అనంతరం పాండవుల చెరువును సందర్శించిన ఆయన అక్కడ ఉన్న ఆట పరికరాలను పరిశీలించారు. పర్యాటకులకు అసౌకర్యంగా ఉండకుండా పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు.

ఆలయాల హుండీల లెక్కింపు

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి19: ధూళిమిట్ట మండలంలోని బెక్కల్ రామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం సిద్దిపేట ఉమాపార్థివ కోటిలింగేశ్వరస్వామి ఆలయ పర్యవేక్షకుడు పి. చంద్రకుమార్ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన హుండీతో పాటు ఉప ఆలయాలుగా ఉన్న పోచమ్మ, ఆంజనేయ స్వామి ఆలయాల హుండీలను లెక్కించారు. 20 ఫిబ్రవరి 2024 నుంచి ఈ నెల 19వరకు భక్తులు హుండీల్లో వేసిన కానుకలను లెక్కించారు. హుండీల ద్వారా రూ.84,986, డిజిటల్ స్కానర్ల ద్వారా రూ. 6247 ఆదాయం లభించింది. కార్యక్రమంలో ఆలయ ఈవో పార్నంది విశ్వనాథశర్మ, ఆలయ చైర్మన్ చొప్పరి మల్లేశం, సభ్యులు ఇమ్మడి శోభాపురుషోత్తంరెడ్డి, ధరావత్ సరిరామ్, చెన్నోజు బ్రహ్మచారి, రాజుపేట మల్లేశం, స్వర్గం సాంబయ్య, ఆలయ అర్చకుడు సిద్దాపురం శివప్ప, గ్రామ పంచాయతీ కార్యదర్శి సిద్ధేశ్వర్, ఆలయ మాజీ చైర్మన్ నలుగొప్పుల రాములు, దేవాదాయశాఖ ఉద్యోగులు, కానిస్టేబుళ్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

కొమురవెల్లి, మార్చి 19 : మండలంలోని ఐనాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం లయన్స్ క్లబ్ హైదరాబాద్ ఎవరెస్టు, లైన్స్ క్లబ్ ఆఫ్ ఆమగల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. 500 మందికి లైన్స్‌క్లబ్ డాక్టర్లు మహేందర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, కృష్ణ, మహేశ్ ఆధ్వర్యంలో ఉచితంగా పరీక్షలు చేయడంతో పాటు మందులు అందజేశారు. కార్యక్రమంలో లైన్స్ క్లబ్ అధ్యక్షుడు, లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ అరవిందకుమార్, సెక్రటరీ జిల్లా రవీందర్, ఉమాశంకర్‌గౌడ్, అమరేందర్‌రెడ్డి, ప్రోగ్రాం ముఖ్య అతిథి గవర్నర్ హరినారాయణ, మహేందర్‌కుమార్ , జి.రఘు, స్వామిగౌడ్, వైస్ ఎంపీపీ రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ బైక్‌లో చెలరేగిన మంటలు

సిద్దిపేట టౌన్,మార్చి 19 : ఎలక్ట్రిక్ బైక్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగిన సంఘటన సిద్దిపేట పాత బస్టాండ్ వద్ద మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు, బాధితుడి వివరాల ప్రకారం.పట్టణానికి చెందిన నరేంద్ర అనే వ్యక్తి సిద్దిపేట మోడల్ బస్టాండ్ వద్ద తన ఎలక్ట్రిక్ బెక్‌ను పార్కు చేశాడు. ఈ క్రమంలో వాహనం నుంచి మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన వాహనదారుడు నరేంద్ర అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులకు విషయం చెప్పాడు. బెక్‌నుంచి వ్యాప్తి చెందుతున్న మంటలను ఆర్పివేశారు. వాహనదారుడు,పోలీసుల అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది.

రెడ్డి సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గోవర్ధన్‌రెడ్డి

కొండపాక(కుకునూరుపల్లి), మార్చి 19 : రెడ్డి సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొండపాక మండలంలోని తిమ్మారెడ్డిపల్లికి చెందిన కూర్మెళ్ల గోవర్ధన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర కార్యాలయంలో రెడ్డి సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఏనుగు సంతోష్‌రెడ్డి, యువత అధ్యక్షుడు ఎలిమినేటి సుమన్‌రెడ్డి నుంచి గోవర్ధన్‌రెడ్డి నియామక పత్రం అందుకున్నారు.

సిద్దిపేటకు చేరిన మహా పాదయాత్ర

సద్గురు మహాదేవ్ స్వామిజీని సత్కరిస్తున్న వీరశైవ లింగ బలిజ సమాజ నేతలు

సిద్దిపేట టౌన్,మార్చి 19 : ఆదిజగద్గురు రేణుక ఆచార్య జయంతిని పురస్కరించుకొని సద్గురు మహదేవ్ స్వామిజీ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా గుడిమెట్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా కొలనుపాక వరకు తలపెట్టిన మహాపాదయాత్ర మంగళవారం సిద్దిపేటకు చేరింది.ఈ సందర్భంగా సిద్దిపేట వీరశైవ లింగ బలిజ సమాజం వారు స్వామిజీకి ఘన స్వాగతం పలికారు. స్థానిక పార్థివ కోటి లింగేశ్వరస్వామి ఆలయంలో వారికి అన్నప్రసాదాన్ని అందించారు. మహా పాదయాత్రలో వీరశైవ బలిజ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఆకుల భద్రప్ప, జిల్లా అధ్యక్షుడు ఆకుల ప్రశాంత్, సిద్దిపేట పట్టణ గౌరవ అధ్యక్షుడు నరుకుల శివప్ప, పట్టణ అధ్యక్షుడు యాదగిరి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

దేవక్కపల్లిలో చెక్‌పోస్టు ఏర్పాటు

వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై కృష్ణారెడ్డి

బెజ్జంకి, మార్చి 19 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని దేవక్కపల్లి శివారు రాజీవ్‌రహదారిపై వాహనాలను తనిఖీ చేయడం కోసం పోలీసుల ఆధ్వర్యంలో చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేసి, వివరాలు సేకరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ గేమ్‌కు బానిసై యువకుడి ఆత్మహత్య

కొండపాక(కుకునూరుపల్లి), మార్చి 19 : ఆన్‌లైన్ గేమ్‌కు బానిసై యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి. సిద్దిపేట ప్రశాంత్ నగర్‌కు చెందిన మద్దెల పవన్ కల్యాణ్(26) జగదేవ్‌పూర్‌లోని ఎంఎస్‌ఎన్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈజీగా డబ్బు సంపాదించాలనే ఆశతో స్నేహితులు, బంధువులు, తెలిసిన వారి వద్ద అప్పులు చేసి ఆన్‌లైన్ గేమ్ ఆడి డబ్బులు పోగొట్టుకున్నాడు. శనివారం రాత్రి విధులకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. విధులకు వెళ్లిన కుమారుడు ఆదివారం ఉదయం ఇంటికి రాకపోవడంతో అతడి తండ్రి మద్దెల పరమేశ్ తన కొడుకు కంపెనీ స్నేహితులు, బంధువులను అడుగగా ఎలాంటి సమాచారం లభించలేదు. మంగళవారం ఉదయం కొండపాక మండలంలోని వెలికట్ట శివారులో చెట్టుకు ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడి జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా మద్దెల పవన్‌కల్యాణ్‌గా గుర్తించి అతడి తండ్రికి ఫోన్ చేసి సమాచారం అందజేశారు. ఆన్‌లైన్ గేమ్ కోసం పవన్‌కల్యాణ్ అప్పులు చేసి ఆత్మహత్యకు పాల్పడినట్లు నిర్ధారణ అయింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి తండ్రి మద్దెల పరమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టుకొమ్మ విరిగిపడి విద్యార్థి మృతి

మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు

గజ్వేల్, మార్చి 19: గాలిదుమారానికి చెట్టుకొమ్మ విరిగిపడి విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కొల్గూర్‌లో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ..గ్రామానికి చెందిన మన్నె రేణుక చంద్రయ్య దంపతుల రెండో కొడుకు వెంకటేశ్ మండలంలోని అహ్మదీపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో టెన్త్ చదువుతున్నాడు. మంగళవారం రెండో రోజు టెన్త్ హిందీ పరీక్ష రాసి ఇంటికొచ్చాడు. మరుసటి రోజు జరిగే ఇంగ్లిష్ పరీక్షకు ప్రిపేరయ్యాడు. సాయంత్రం పొలం వద్ద ఉన్న తల్లిదండ్రుల వద్దకు వెళ్లిన అతడు పశువులను తోలుకుంటూ ఇంటికొస్తున్న సమయంలో భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం రావడం..గ్రామానికి చేరుకునే సమయానికి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకొమ్మ విరిగి అతడి మీద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి తల్లిదండ్రులు, అన్న కలిసి పొలం నుంచి బైక్‌పై ఇంటికొచ్చారు. వారి వెనుకాలే పశువులను తోలుకుంటూ ఇంటికి మరో ఐదు నిమిషాల్లో చేరుకుంటాడనుకునే లోపే వెంకటేశ్ మృతి చెందాడు. చెట్టుకొమ్మ విరిగి మీద పడడంతో తమ కొడుకు మృతి చెందాడని తెలువడంతో బోరున రోదిస్తూ ఘటనాస్థలికి కుటుంబ సభ్యులు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న స్నేహితులు, పాఠశాల ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

ఉపాధి కూలీలకు డబ్బులు చెల్లించాలి

కొమురవెల్లి, మార్చి 19 : ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు వెంటనే డబ్బులు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తాడూరి రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ఐనాపూర్‌లో ఉపాధిహామీ పనులు జరిగే ప్రదేశాన్ని సీపీఎం నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలకు తొమ్మిది వారాల నుంచి డబ్బులు అందడం లేదన్నారు. దీంతో వాళ్లు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఉపాధిహామీ కూలీలకు డబ్బులు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తేలు ఇస్తారి, ఉల్లంపల్లి సాయిలు, ఐద్వా నాయకురాలు ఉల్లంపల్లి నర్సవ్వ, సున్నం కనకయ్య, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

విశ్వకర్మ కార్పొరేషన్‌కు రూ.500కోట్లు కేటాయించాలి

హుస్నాబాద్, మార్చి 19: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విశ్వకర్మ కార్పొరేషన్‌కు రూ.500కోట్లు కేటాయించి నిరుపేద విశ్వకర్మలను ఆదుకోవాలని అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ మండల అధ్యక్షుడు ఎగ్గోజు సుదర్శనాచారి కోరారు. మంగళవారం సంఘం కార్యాలయంలో జరిగిన మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లలో ప్రాధాన్యత కల్పించాలని, 50ఏండ్లు దాటిన విశ్వకర్మలకు పింఛన్ ఇవ్వాలని, విద్యార్థులకు ఉచిత విద్య అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వృత్తిపని చేసుకునే విశ్వకర్మలకు ఉచిత విద్యుత్ అందించాలని, సబ్సిడీ రుణాలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో పరిషత్ మండల ఉపాధ్యక్షుడు ఉప్పుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అలువోజు కుమారస్వామి, భాస్కరాచారి, రవీందర్, శ్రీకాంత్, దామోదరాచారి, కనుకయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

సీఎంను కలిసిన డాక్టర్ పరమేశ్వర్

సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డాక్టర్ పరమేశ్వర్

చేర్యాల, మార్చి 19 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మంగళవారం చేర్యాల పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు ఆర్.పరమేశ్వర్ న్యూఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలిశారు. వరంగల్ ఎంపీ టికెట్ రేసులో ఉన్న డాక్టర్ పరమేశ్వర్ ఢిల్లీకి వెళ్లి అక్కడ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

సిద్దిపేట టౌన్,మార్చి 19 : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ పిలుపునిచ్చారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం గ్లోబల్ రీసైక్లింగ్ డేను పురస్కరించుకొని ఒకరోజు సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రసాద్ మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకొని చెత్తనువేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు,విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియపరచటం ఏమనగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, సిరిసిల్ల శాఖ గారు. కంచర్ల రేఖ, W/o కనకయ్య, పద్మనాభునిపల్లి, గ్రామం: తిమ్మాపూర్, దుబ్బాక మండలం, సిద్దిపేట జిల్లా గారికి వ్యాపార నిమిత్తం ఋణ సదుపాయం కల్పించుచున్నారు. ఇట్టి విషయములో తన యొక్క స్వంత ఆస్తి అయిన ఖాళీ స్థలం ప్లాట్ నెం. 11, దీని యొక్క విస్తీర్ణం: 185.50 చ||గ||, మరియు దీని సర్వే నెం. 532, దుమాల గ్రామం, ఎల్లారెడ్డిపేట మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా నా క్లయింట్‌కు పై ఋణ విషయములో తనఖాగా పెట్టి పై ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు అప్పగించినారు.కావున ఇట్టి ఆస్తిపై ఎవరికైనా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపనలు కానీ వ్యాజములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 7 దినముల లోగా తగు దస్తావేజులతో నా కార్యాలయమునకు వచ్చి సంప్రదించగలరు. లేనిచో ఎవరికి అభ్యంతరాలు లేవని ధృవీకరించబడును.

తేది: 19-03-2024 స్థలము: సిరిసిల్ల.

ఇట్లు: Sd/- పిన్నింటి అశోక్, అడ్వకేట్,
ఇ.నెం.3-7-852/1.వావిలాలపల్లి,కరీంనగర్ సెల్: 9849331558

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE COURT AT GAJWEL
O.S.No. 3 of 2024.

Between:
Thavula Laxmi and 3 others ....Plaintiffs.
A-n-d
1. The Thasildar, Wargal Mandal Siddipet District.
2. To whom so ever it may be all Concerned. ...Defendants.

NOTICE
To Whom So ever it may Concern (Defendant No.2)

Take Notice that the plaintiff filed the above suit for Declaration that the Plaintiffs as the Legal Heirs and Successors of Late Chiguru Dakaiah S/o Agaiah against the defendants and the same is posted on **04-04-2024 at 10:30 A.M** for appearance, If any persons have got objection for the same, they may appear before this Hon'ble Principal Junior Civil Judge at Gajwel, in person or through advocate failing which the matter will be decided as per law.

(By Order of the Court)
Sd/- **P.NARESH CHARY,** Advocate
GAJWEL
Cell No.9441003119